క్లుప్తంగా

రోడ్లపై నీరు నిల్వకుండా చూడండి



కాలనీలో పర్యటిస్తున్న వెస్ట్ జోన్ కమిషనర్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): పట్టణంలోని రాంచంద్రారెడ్డినగర్ కాలనీలో శుక్రవారం జీహెచ్‌ఎంసీ వెస్ట్ జోన్ కమిషనర్ హేమంత్ బోర్కాడే సహదేవరావు పర్యటించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీలో రోడ్లు పూర్తిగా జలమయం అయ్యాయి. దీంతో విషయం తెలుసుకున్న ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. వర్షా కాలంలో సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈసందర్భంగా డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ పుష్ప కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

నాణ్యతలో రాజీపడొద్దు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: జీహెచ్‌ఎంసీ పరిధిలోని కాలనీల్లో చేపడుతున్న రహదారుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని.. లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్ కాలనీలో రూ.కోటి 55 లక్షలతో చేపడుతున్న సీసీ, బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. రోడ్ల నిర్మాణ సమయంలో నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసి.. ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శివకుమార్ పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం

టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి



వెంకటాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న నిర్మలారెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారమవుతోందని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని సీడీసీ చైర్మన్ రాంరెడ్డితో కలిసి ముగ్గుపోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ. 5లక్షల ఆర్థిక సహాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సోమేశ్ కుమార్, ఎంపీడీఓ లక్ష్మి, డీఈ మాధవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇమ్యూనైజేషన్ అధికారి మనోహర్‌రెడ్డి సూచించారు. స్థానిక పీహెచ్‌సీని ఆయన శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యులు, వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రసవాల సంఖ్య పెంచడంతో పాటు వైద్య సేవలు అందించడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎస్‌ఆర్ నిధులు రావాల్సి ఉందని అవి వచ్చిన వెంటనే ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వైద్యులు అమృత్‌రాజ్, హైమావతి, హెల్త్ సూపర్ వైజర్ మార్త, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత సంతరించుకున్న ఐఐటీ



కందిలో సంగీతం వినిపిస్తున్న బృందం సభ్యులు

సంగారెడ్డి జోన్: కందిలోని ఐఐటీ హైదరాబాద్ ఆధ్యాత్మికతను సంతరించుకుంది. స్పిక్ మెకే ఆధ్వర్యంలో జరుగుతున్న 10వ అంతర్జాతీయ సదస్సు కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం నిమ్రనా మ్యూజిక్ ఫౌండేషన్ సంగీత బృందం సభ్యులు, భాయ్ గురుదేవ్ సింగ్ హజూరి నిర్వహించిన సంగీత కార్యక్రమాలు ఆహుతుల్ని అలరించాయి.

కౌలు భూములే.. బంగారమాయే



బొబ్బిలిగామ గ్రామంలో బీడు భూములలో పోసిన మట్టి

ప్రభుత్వ నిర్ణయంతో పట్టాదారులే సాగు

- భరోసాపై రైతుల ఆశలు
- కౌలుదారు కార్డు మంజూరు చేయాలి

మునిపల్లి(అందోల్): కౌలు రైతులకు కూడా రైతు భరోసా మంజూరు చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో పట్టాదారులు తమ భూములను కౌలుకు ఇవ్వడానికి వెనుకంజ వేస్తున్నారు. కౌలు రైతులకు భూములిస్తే తమకు రైతు భరోసా రాదేమోనని కూలీలతో వ్యవసాయం చేయిస్తున్నారు. రైతు బంధు, భరోసా పుణ్యమా అని ఒకప్పుడు దేనికీ పనికి రావనుకున్న భూములు ఇప్పుడు బంగారమయ్యాయి.

మట్టిపోసి సిద్ధం చేస్తున్నారు..

ఆర్థికంగా బలంగా ఉన్న వారు సాగుకు యోగ్యమయ్యే భూములే కాకుండా.. సాగుకు యోగ్యం కాని భూములను తీసుకుని చేరువుల నుంచి తీసుకువచ్చిన మట్టిని పోసి సాగుకు సిద్ధం చేయిస్తున్నారు. బీడు భూములను సైతం కొందరు రైతులు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు.

పథకాలు అందుతుండడంతో..

వ్యవసాయ భూములపై ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు మంజూరు చేస్తుండడంతో కొందరు సాగుకు యోగ్యమైన భూములను కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు కూడా రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ.12వేలు మంజూరు చేస్తామని గతంలో ప్రకటించింది.

కౌలు రైతులను ఆదుకోవాలి



ప్రభుత్వం రైతు భరోసా మంజూరు చేసి కౌలు రైతులను ఆదుకోవాలి. కౌలు దారు కార్డు మంజూరుచేసి ఆ కార్డు ద్వారానే పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. నాకు ఉన్న మూడెకరాలతో పాటు మరో 15 ఎరకాల వరకు కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నా.

బోయిని శ్రీనివాస్, కౌలురైతు, తాటిపల్లి

మాకు ఆదేశాలు రాలేదు



కౌలు రైతులకు కార్డు ద్వారా పంట కొనుగోలు, రైతు భరోసా మంజూరు చేయడం ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది. కౌలుదారు కార్డులను కౌలు రైతులకు ఇవ్వాలని మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

అధ్వానంగా అల్గోల్ రోడ్డు

ప్రయాణికులకు తప్పని తిప్పలు

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలోని అల్గోల్ గ్రామానికి వెళ్లే రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనాలు రాక పోకలు సాగించలేని పరిస్థితి నెలకొందని వాహన చోదకులు వాపోతున్నారు. బైపాస్ రోడ్డు వద్ద బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్న చోట రహదారికి ఇరువైపులా పెద్ద గోతులు ఏర్పాడ్డాయి. వర్షం నీరు నిలిచి గోతులు తెలియక వాహనాలు కూరుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మించే విషయంలో ఆర్ అండ్‌బీ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాహన చోదకులు, అల్గోల్ గ్రామ ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ రహదారి అల్గోల్ గ్రామంతో పాటు కర్ణాటకలోని బీదర్, న్యాల్‌కల్ మండలాలకు వెళ్లే ప్రజలకు బైపాస్ రహదారిగా ఉపయోగపడుతోంది. దీంతో బీదర్ క్రాస్ రోడ్డు నుంచి కాకుండా ఇదే రహదారి గుండా ప్రతి నిత్యం వందలాది వాహనాలు రాక పోకలు సాగిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గోతులను పూడ్చి వేయించి సమస్యను పరిష్కరించాలని వాహన చోదకులు, ప్రజలు కోరుతున్నారు.



గోతులు ఏర్పడి రాక పోకలకు ఇబ్బందికరంగా మారిన రహదారి

రజతోత్సవానికి తరలిరండి

నారాయణఖేడ్: తెలంగాణ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజే–హెచ్143) సంఘం రజతోత్సవాలను విజయవంతం చేయాలని సంఘం ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు అమృతం పిలుపునిచ్చారు. సంఘం ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా శనివారం హైదరాబాద్ జలవిహార్‌లో రజతోత్సవ సభ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు ఇళ్లు

ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి



కల్హేర్: బాచేపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కల్హేర్(నారాయణఖేడ్): ఇందిరమ్మ రాజ్యంలో గూడు లేని పేదలకు ఇళ్లు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి తెలిపారు. నిజాంపేట్ మండలం బాచేపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చాక పేదలకు 6 కిలోలు ఉచితంగా సన్నబియ్యం అందజేస్తున్నామన్నారు. మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం సౌకర్యం, ఇతర సంక్షేమ కార్యక్రమలు అమలు చేస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంగ్రామ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, నాయకులు రమేశ్‌చౌహాన్, శ్రీకాంత్, దుర్గారెడ్డి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): సమాజాభివృద్ధికి రోటరీ క్లబ్ సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి పేర్కొన్నారు. పట్టణ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ రవీంద్రమోడల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహిళలకు రొమ్ము కేన్సర్, స్క్రీనింగ్ క్యాంప్, గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఎమ్మెల్యే చింతా , నిర్మలారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయన్నారు. ప్రజలందరు రోటరీ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రాంతంలో రోటరీ క్లబ్ సభ్యులు భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే సేవలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ లేక్ డిస్ట్రిక్ మొహినాబాద్ అధ్యక్షుడు ఓదెల రాజశేఖర్, పట్టణ అధ్యక్షుడు ఓదెల ప్రభుగుప్తా, కార్యదర్శి అశోక్‌కుమార్, ట్రెజరీ వేణు, ప్రముఖ వైద్య నిపుణులు శివకుమార్, చంద్రశేఖర్, కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

సుందరయ్య భవన్‌లో సీఐటీయూ జెండా ఆవిష్కరణ

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని జిల్లా అధ్యక్షుడు బి మల్లేశం పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం ఆ సంఘం జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్మికులు, కర్షకులు, శ్రామిక జీవుల సమస్యలపై పోరాడేందుకు సీఐటీయూ 1970 మే 30న కలకత్తా నగరంలో ఆవిర్భవించిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు దేశవ్యాప్తంగా కార్మికుల పక్షాన సమర శీలంగా పోరాడుతూ వస్తోందని తెలిపారు. 1991లో సరళీకరణ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ దేశవ్యాప్తంగా ఉద్యమాలు నడిపిందని పేర్కొన్నారు. కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులు శ్రామికుల శ్రమను దోచుకునేందుకు వీలుగా ప్రధాని మోదీ నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయాలని చూస్తున్నారన్నారు. లేబర్ కోడ్‌లో అమల్లోకి వస్తే 95% మంది కార్మిక వర్గం వెట్టి చాకిరిలోకి నెట్టబడతారని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో సంగారెడ్డి జిల్లాలోని కార్మిక వర్గం అంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మాణిక్యం నాయకులు మల్లేశం, శ్రీనివాస్, యాదయ్య, సుజాత, దత్తు, హనుమంతు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో సీఐటీయూ జెండాను ఎగురవేస్తున్న మల్లేశం

ఐక్యంగా పోరాటం..

నారాయణఖేడ్: నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం కార్మికులు ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. నారాయణఖేడ్‌లో శుక్రవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండావిష్కరణ చేశారు. మున్సిపల్ యూనియన్ అధ్యక్షురాలు శకుంతల, సిద్ధమ్మ, రవి, సత్యనారాయణ, ఆదాం, తుకారాం, సంగన్న పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

కంగ్టి(నారాయణఖేడ్): శాంతియుతంగా బక్రీద్ పండుగ జరుపుకోవాలని కంగ్టి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన హిందు, ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత సామరస్యంతో అందరు శాంతియుత జీవనం గడపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ దుర్గారెడ్డి, సిబ్బంది, అయా గ్రామానికి చెందిన పెద్దలు పాల్గొన్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జోగిపేట(అందోల్): పట్టణంలో శనివారం ఐదున్నర గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ తీగలకు తగులుతున్న కొమ్మలను తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. దీని వల్ల పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

◆ నేటి నుంచి జనుము విత్తనాల పంపిణీ

రాయికోడ్(అందోల్): రైతులకు శనివారం నుంచి జనుము విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సారిక తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాయికోడ్‌లోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో 80 క్వింటాళ్ల జనుము విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. 40 కిలోల జనుము బస్తా రూ.2,510లకు రైతులకు అందించనున్నట్లు తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు, భూ పట్టా పాసుపుస్తకం జిరాక్స్ కాపీలను తీసుకువచ్చి ఆగ్రోస్ కేంద్రంలో విత్తనాలు పొందాలని సూచించారు.

◆ ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

జిన్నారం(పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలాల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మండల ప్రత్యేక అధికారులు అరుణరెడ్డి, ఉమాదేవి భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు వచ్చి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ 3 నుంచి భూ భారతిపై సదస్సులు

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలంలో జూన్ 3 నుంచి 20 వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు నిజాంపేట్ తహసీల్దార్ నాగజ్యోతి శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 3వ తేదీన జంబికుంట, 4న ఖానాపూర్(బి), 5, 6వ తేదీల్లో ర్యాలమడుగు, 9, 10 తేదీల్లో బాచేపల్లి, 11, 12తేదీల్లో మునిగేపల్లి, 13, 16తేదీల్లో నాగ్‌ధర్, 17, 18న నిజాంపేట్, 19, 20తేదీల్లో రాంరెడ్డిపేట్‌లలో ఈ గ్రామసభలు ఉంటాయని పేర్కొన్నారు.

◆ ఎమ్మెల్యేకు ఆహ్వానం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వేదన్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని సంస్థ సీఈవో మల్లికార్జున్ శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆహ్వానించారు. జూన్ 3వ తేదీన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.



నారాయణఖేడ్: గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

సర్కార్ బడికే పంపించండి



రాయికోడ్: బడిబాటలో ర్యాలీలో పాల్గొన్న హెచ్‌ఎం శ్రీనివాస్



అంతారంలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణఖేడ్ : తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ బడుల్లో కల్పిస్తున్న సదుపాయా లు, విద్య, మౌలిక సదుపాయాలు, ఉచిత పాఠ్య, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్ అలీ సైతం ఉపాధ్యాయులతో కలిసి అవగాహన కల్పించారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

రాయికోడ్(అందోల్): ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్యా బోధన అందుతుందని రాయికోడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా రాయికోడ్‌లో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతపై నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని తల్లింద్రులను కోరారు. ఉపాధ్యాయులు, ఎంఆర్‌పీసీ సిబ్బంది అనంత్‌రామ్, శివలక్ష్మి, అపర్ణ, మోహన్, రాజు, దత్తు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను చేర్పించండి

మునపల్లి(అందోల్): బడీడు పిల్లలను పాఠశాలకు పంపించాలని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఉపాధ్యాయులు, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం..ఉచిత దుస్తులు..

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్ గ్రామంలో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఇస్తున్నట్లు తెలిపారు. పాఠశాల సిబ్బంది జ్యోతి, శ్రీరామ్, అర్షద్ హుస్సేన్, మనిప్రసాద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లకు దీటుగా...

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈఓ శంకర్ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణతో కలసి పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరించడంతోపాటు కరపత్రాలను పంపిణీ చేశారు. ఏప్రిల్,మే నెల మొదటి వారంలోనే ముందస్తు బడిబాట నిర్వహించి ప్రైవేట్ పాఠశాలలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినందుకు తల్లిదండ్రులను, హెచ్‌ఎం రామకృష్ణను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్ర అవతరణోత్సవానికి ఏర్పాట్లు

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: రాష్ట్ర అవతరణ దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ, మున్సిపల్‌తోపాటు వివిధ శాఖల అధికారులో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ...అధికారుల సమన్వయంతో రాష్ట్ర అవతరణ దినోత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ సాంస్కృతిక ప్రదర్శనలు, పాటలు, నృత్యాలు, తెలంగాణ గర్వకారణాలపై డిజిటల్ ప్రదర్శనలు, స్థానిక కళాకారుల ప్రదర్శనలు నిర్వహించాలని విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. విద్యుత్ శాఖ, నీటి సరఫరా శాఖలతో సహకరించి వేడుకలు జరిగే ప్రాంతాల్లో నిరంతర సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శకటాలు, స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. అంతకుముందు కలెక్టరేట్‌లో దివ్యాంగుల ఆర్కెస్ట్రా బృందానికి రూ.1,16,610 ఆర్థిక సాయాన్ని కలెక్టర్ క్రాంతి అందజేశారు. అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ పద్మజారాణి, ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, రాంరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా అధికారులు, మున్సిపల్, పోలీస్ అధికారులు దివ్యాంగులు లక్ష్మి, నగేష్, భాగ్య, పద్మ, సరోజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి, చిత్రంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి తదితరులు

ఆర్‌అండ్ బీ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం



గుంతలుపడి దెబ్బతిన్న అల్గోల్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు

జహీరాబాద్ టౌన్: నిధులు మంజూరైనా త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయించడంలేదని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ఆర్‌అండ్‌బీ అధికారులపై అగ్రహం వ్యక్తం చేశారు. బైపాస్ రహదారి నుంచి అల్గోల్‌కు వెళ్లే రోడ్డు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. రోడ్డుపై మోకాలి వరకు గుంతలు పడ్డాయి. కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరి వాహనాలు పడిపోతున్నాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్ అండ్‌బీ అధికారులతో కలిసి శుక్రవారం రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..అల్గోల్ రోడ్డులో వాగుపై బ్రిడ్జితోపాటు అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.80 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. కాంట్రాక్టర్ బ్రిడ్జి పనులు చేపట్టి రోడ్డు వేయకుండా వదిలేశారన్నారు. అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకురాకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆర్ అండ్‌బీ ఎస్‌ఈతో ఫోన్‌లో మాట్లాడారు. త్వరలోనే రోడ్డు పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు.ఎమ్మెల్యే వెంట ఆర్‌అండ్‌బీ ఏఈ, బీఆర్‌ఎస్ నాయకులు నామ రవికిరణ్, గుండప్ప,మోహియోద్దీన్, యాకూబ్, మిథున్‌రాజ్ తదితరులున్నారు.

అధికారులకు నిరసన సెగ

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ నిర్మాణానికి వచ్చిన అధికారులకు గ్రామస్తుల నుంచి నిరసన సెగ తగిలింది. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో గ్రామంలో ఒకరికి మాత్రమే ఇల్లు కేటాయించడంపై నిలదీశారు. ఓ దశలో అధికారులతో గ్రామస్తులు వాగ్వాదానికి దిగారు. గ్రామంలో మేజర్ పంచాయతీగా పేరున్న బొంతపల్లి గ్రామంలో పదివేల జనాభా, 6,000 ఓట్లు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం కేవలం ఒక లబ్ధిదారున్ని గుర్తించి పథకాన్ని ప్రారంభించడం ఏంటని ప్రశ్నించారు. ఇందిరమ్మ కమిటీల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఎంపిక చేపట్టడం సరికాదన్నారు. గ్రామస్తులు లేవనెత్తిన అంశాలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని అధికారులు అక్కడి నుంచి వెనుతిరిగి వెళ్లిపోయారు. కార్యక్రమంలో మండల అధికారులు మాజీ ప్రజా ప్రతినిధులు సురబీ నాగేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, గిద్దె రాజు, వినోద్, నాయకులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నిరసన చేస్తున్న గ్రామస్తులు, నాయకులు